పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**గూడూరు, పెన్ పవర్, ఆగస్టు 2:** గూడూరు గ్రామంలో శనివారం నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గోపి నాగబాబు మాట్లాడుతూ, ప్రభుత్వం చేసిన మంచి పనులను వివరించకముందే ప్రతి ఇంట్లో ప్రజలే తమ కుటుంబానికి అందిన సంక్షేమ ఫలాలను గర్వంగా ప్రస్తావించడం కూటమి ప్రభుత్వంపై వారికి ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ప్రజల నుంచి లభిస్తున్న విశేష ఆదరణ తమపై మరింత బాధ్యతను పెంచుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తోట వేణు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు అన్నం హరి రామకృష్ణ, మాజీ సర్పంచ్ పోతన రామోజీ, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎన్.ఏ. బేగ్,



కూటమి నాయకులు యర ప్రసాద్, శాత కుమారస్వామి, బచ్చుల రామాంజనేయులు, బేతాళ స్వామి, అట్లూరి శ్రీను, పోతన రంగ, కభం పవన్, డొక్కు బాబురావు, ఎండీ రోషన్, కొలుసు నరసింహారావు, పోతన పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు నాటక రంగానికి బళ్లారి రాఘవ సేవలు చిరస్మరణీయం : జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్, ఆగస్టు 2:** తెలుగు నాటక రంగానికి విశిష్ట సేవలందించిన మహానటుడు బళ్లారి రాఘవ కళా వైభవానికి ప్రతీక అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. బళ్లారి రాఘవ జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి



ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలుగు నాటక రంగ అభివృద్ధికి బళ్లారి రాఘవ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నటనకు కొత్త ఒరవడిని తీసుకువచ్చిన మహానటుడిగా, కళను సామాజిక చైతన్యానికి సాధనంగా మలిచిన మహోన్నత వ్యక్తిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. బళ్లారి రాఘవ నటించిన నాటకాలు ప్రేక్షకులను ఆలోచింపజేసేలా ఉండేవని, వినోదంతో పాటు సమాజానికి మంచి సందేశాలను అందించడంలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. కళను సమాజ మార్పుకు శక్తివంతమైన సాధనంగా భావించి జీవితాంతం నాటక కళాభివృద్ధికి అంకితభావంతో కృషి చేశారని చెప్పారు. బళ్లారి రాఘవ ఆశయాలు, కళా వారసత్వం నేటి కళాకారులకు, భావి తరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పేర్కొన్నారు.

## ఆరోగ్యవంతమైనసమాజనిర్మాణానికి ఉచిత వైద్య శిబిరాలు అవసరం : ఎమ్మెల్యే గళ్లా మాధవి



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్టు 2:** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 24వ డివిజన్ చుట్టుగుంట పోలేరమ్మ అమ్మవారి దేవస్థాన కల్యాణమండపంలో వికాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సేవలు పొందుతున్న ప్రజలతో మాట్లాడిన ఎమ్మెల్యే, వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో అవసరమని అన్నారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించి, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఇటువంటి శిబిరాలు ఉపయోగపడతాయని తెలిపారు. వికాస్ హాస్పిటల్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించిన ఎమ్మెల్యే, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు తుమ్మల నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పెడన పోలీస్ స్టేషన్‌లో పచ్చదనానికి శ్రీకారం



**పెడన,పెన్ పవర్, ఆగస్టు 2:** కృష్ణాజిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా పెడన పోలీస్ స్టేషన్‌లో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై-2 షేక్ బషీర్ తన సిబ్బందితో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పూర్తిగా శుభ్రపరిచి, పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో వివిధ రకాల మొక్కలను నాటారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్సై షేక్ బషీర్ పేర్కొన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడటంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని, కాలుష్య నియంత్రణతో పాటు స్వచ్ఛమైన గాలిని అందించడంలో మొక్కల ప్రాధాన్యం ఎంతో ఉందని వివరించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, పచ్చదనం పెంపుదలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, కార్యాలయం లేదా గ్రామ పరిసరాల్లో కనీసం ఒక మొక్క అయినా నాటి, దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు.

# రూ.52కే నాణ్యమైన సన్న బియ్యం

### రాష్ట్రవ్యాప్తంగా విక్రయాలు ప్రారంభం

**విజయవాడ,పెన్‌పవర్, ఆగస్టు 2:** బియ్యం ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు ఊరట కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కిలో నాణ్యమైన బీపీటీ స్టీమ్ సన్న బియ్యాన్ని రూ. 52కు, బీపీటీ రా (పచ్చి) బియ్యాన్ని రూ. 50కు రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నుంచి విక్రయాలు ప్రారంభిం చింది. విజయవాడలోని ఏపీఐఐసీ కాలనీ రైతు బజార్‌లో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ



కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గద్దె రామమోహన్, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీవాస్ నూపూర్ అజయ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు పెరగడంతో ప్రజలపై భారం తగ్గించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలోని 150 రైతు బజార్లు, 500 రైస్‌మిల్ అవుట్‌లెట్లలో ఈ బియ్యం అందుబాటులో ఉంటుందని, ఒక్కో కుటుంబానికి గరిష్టంగా 10 కిలోల వరకు విక్రయిస్తామని చెప్పారు. ధరల నియంత్రణతో పాటు నాణ్యమైన బియ్యం అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్ వంటి నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి వెల్లడించారు. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కారం చూపడంలో కూటమి ప్రభుత్వం ముందుంటోందని అన్నారు. రూ.52కే నాణ్యమైన సన్న బియ్యం అందుబాటులోకి తీసుకురావడం సామాన్య ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని, మార్కెట్‌లో బియ్యం ధరల నియంత్రణకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

# కృష్ణా, గోదావరి జలాలపై స్పష్టమైన విధానం ఉండాలి : నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి

గోదావరి, కృష్ణా జలాల వివాదాల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవాళ(ఆదివారం) రాజమండ్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమిలో భాగస్వామ్య పార్టీలు వేరైనా, ప్రభుత్వాల బాధ్యత రైతుల ప్రయోజనాలను కాపాడటమేనని ఉద్ఘాటించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నిర్మించకపోతే విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉండదని కిరణ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పోలవరం ముంపు పరిధిలోని భూసేకరణ కోసం ఏపీ ప్రభుత్వం తక్షణమే ఆ రాష్ట్రాలతో సంప్రదింపులు ప్రారంభించాలన్నారు. 'ఒడిశాలో భూసేకరణ కోసం అవసరమైతే 10 నుంచి 15 రెట్లు పరిహారం ఇచ్చినా నష్టం లేదు. ఈ విషయాన్ని నేను స్వయంగా సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లాను' అని వెల్లడించారు. కృష్ణా జలాల విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్న ఆయన.. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ తీర్పు అమలులోకి వస్తే ఏపీ 277 టీఎంసీలు, తెలంగాణ 97 టీఎంసీల నీటిని నష్టపోతాయని హెచ్చరించారు. ఇది రెండు రాష్ట్రాలకు 'డబుల్ పంచ్' లాంటిదని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి పోరాడాలని



పిలుపునిచ్చారు. 'ముఖ్యమంత్రులు కలవడంలో తప్పులేదు, కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏం సాధిస్తున్నారనేదే ముఖ్యం' అని అన్నారు. గతంలో తాను కృష్ణా జలాల పరిరక్షణ కోసమే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశానని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.

# దుర్గగుడిలో ఇన్‌స్టా రీల్ కలకలం

### యువతిపై పోలీసులకు ఫిర్యాదు

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేసిన యువతిపై ఆలయ అధికారులు సీరియస్ అయ్యారు. దేవస్థానం ఆచారాలు, సంప్రదాయాలకు విరుద్ధంగా వ్యవహరించిందని ఆరోపిస్తూ యువతిపై విజయవాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల దుర్గామాత ఆలయంలోని మహామండపం ఏడో అంతస్తు రాజగోపురం వద్ద ఓ అపరిచిత యువతి డ్యాన్స్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్ రీల్ చిత్రీకరించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భక్తులు, ప్రజల నుంచి పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు, ఈ విషయం ఆలయ అధికారుల దృష్టికి వెళ్లింది. దేవస్థానం ఈవో వి.కె.శీనా నాయక్ ఆదేశాల మేరకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఇవాళ (ఆదివారం) ఉదయం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. సదరు యువతి జులై 30న మధ్యాహ్నం 1:45 గంటల నుంచి 1:47 గంటల మధ్య వీడియో చిత్రీకరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు రెండు నిమిషాల పాటు ఆమె వీడియో చిత్రీకరించి తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్టు చేసినట్లు తెలిపారు. దేవదాయ శాఖ నిబంధనలు, ఆలయ పవిత్రతకు ఇది పూర్తిగా విరుద్ధమని దేవస్థానం




అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు యువతిని గుర్తించి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను అధికారులు కోరారు. ఆలయ పవిత్రతను దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తేల్చిచెప్పారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు చేపడతామని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

## సౌత్ కోస్టల్ రైల్వే జీఎం మాథుర్‌ను కలిసిన ఎంపీ శివనాథ్

సౌత్ కోస్టల్ రైల్వే జీఎం మాథుర్‌ను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఈరోజు(శనివారం) కలిశారు. జీఎం మాథుర్‌ను కలిసి పలు కీలక అంశాలపై చర్చించామని తెలిపారు. కొండపల్లి రైల్వేస్టేషన్‌ను కూడా అమృత్ భారత్ కింద అభివృద్ధి చేయాలని అడిగామని చెప్పారు. విజయవాడ చుట్టుపక్కల రైల్వే సమస్యల గురించి తెలిపామని అన్నారు. విజయవాడకు ట్రాఫిక్ సమస్య తీరేలా 8 ఆర్వోబీల ఏర్పాటు గురించి మాట్లాడామని తెలిపారు. ఎర్రకట్ట వంతెన పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు అతి ముఖ్యమని చెప్పుకొచ్చారు. గుణదల రాజ-8 కూడా చాలా అవసరమని తెలిపామని ఎంపీ శివనాథ్ అన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి టెండర్లు వేసినా ఎవరూ రాలేదని చెప్పారు. కేంద్ర రైల్వేమంత్రిని ఎంపీలందరం కలిసి విజయవాడను అమృత్ భారత్ కింద అభివృద్ధి చేయాలని కోరుతామని అన్నారు. విజయవాడ - బెంగళూరు వయా



గుత్తి రైల్వేలైన్ కావాలని కేంద్రమంత్రిని తాము అడుగుతామని ఎంపీ శివనాథ్ పేర్కొన్నారు.

## వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు



**మచిలీపట్నం, పెన్ పవర్, ఆగస్టు 2:** జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య 150వ జయంతి వేడుకలు ఆదివారం మచిలీపట్నంలోని చిలకలపూడి పోలీస్ స్టేషన్ సమీపంలోని ఆయన విగ్రహం వద్ద వెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు చందమామ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ వెంకట బాపిరాజు మాట్లాడుతూ, పింగళి వెంకయ్య ఆశయాలను భావితరాలకు చేరవేసి వాటి సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశానికి జాతీయ పతాకాన్ని అందించిన మహనీయుడు తెలుగువారు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు ఎన్‌సీసీ, సైనిక శిక్షణ వంటి కార్యక్రమాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మచిలీపట్నంలో పింగళి వెంకయ్యకు తగిన స్థాయిలో విగ్రహం ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ పింగళి వెంకయ్య కాంస్య విగ్రహం ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవాలని కోరారు. సీఐ ఏసుబాబు, ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, స్టార్ కాలేజీ డైరెక్టర్ శ్రీరామ్, పంతం వెంకట గజేంద్ర రావు తదితరులు పింగళి వెంకయ్య సేవలను కొనియాడారు. అనంతరం ఉత్తమ అధికారిగా ప్రశంసలు అందుకుని విజయవాడకు బదిలీపై వెళ్తున్న పెద్దిరాజును వెలుగు ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కే. వేణు, మాజీ సైనికులు, పోలీసు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100 ఫోన్ చేసి ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చు : జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ

**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 2:** మీ కోసం వెబ్ సైట్‌హాలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల స్థాయిలోను నిర్వహించడం



జరుగుతుందని చెప్పారు. ప్రజలు నేరుగా సోమవారం నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు సమర్పించవచ్చని లేదా మీ కోసం వెబ్ సైట్‌హామీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకొని, ఆర్జీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు.

## పీజీఆర్ఎస్‌పై స్పందనకు ప్రత్యేక క్యూఆర్ కోడ్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్, ఆగస్టు, 2 :** ఈ నెల 3వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం ... పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం)




కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని.. అదే విధంగా అర్జీదారులు తమ స్పందన తెలియజేసేందుకు ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి అభిప్రాయాలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ప్రజా స్నేహపూర్వక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంతో పాటు డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని .. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ సూచించారు.

## అంకెం వారి ఆడపడుచుల ఆధ్వర్యంలో శాఖంబరి అలంకరణ



పెడన, పెన్ పవర్,ఆగస్టు 2: పెడన మండలం దావోజిపాలెం గ్రామంలోని శ్రీ విజయ అమలేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారు శాఖంబరి దేవి అలంకరణలో భక్తులకు దివ్యదర్శనం ఇచ్చారు. ఈ వేడుక ప్రత్యేకత ఏమిటంటే, ఆలయ ఉత్సవాన్ని అంకెం వారి ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం విశేషంగా నిలిచింది. పుష్పాలు, పలు రకాల కూరగాయలు, పండ్లతో అత్యంత సుందరంగా అలంకరించిన అమ్మవారి దివ్యరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అర్చనలు నిర్వహించగా, అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. గ్రామంలో భక్తిశ్రద్ధల మధ్య శాఖంబరి దేవి అలంకరణ మహోత్సవం వైభవంగా జరగడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.

## మిద్దె తోటలతో ఆరోగ్యకరమైన హరిత సమాజం నిర్మిద్దాం : కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



విజయవాడ,పెన్‌పవర్,ఆగస్టు2: మిద్దె తోటలు ప్రతి కుటుంబానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించడంతో పాటు పచ్చని సమాజ నిర్మాణానికి దోహదపడతాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. విజయవాడలో జరిగిన సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ (సీటీజీ) ఐదవ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంట్లో మిద్దె తోటలు ఏర్పాటు చేసి సేంద్రీయ కూరగాయలు, ఆకుకూరలు పండించాలని, పిల్లల్లో ప్రకృతి పట్ల బాధ్యత పెంపొందించాలని సూచించారు. హరిత సమాజ నిర్మాణంలో సీటీజీ చేస్తున్న సేవలను కలెక్టర్ అభినందించారు. రీసైక్లింగ్‌తో రూపొందించిన కళాకృతులను పరిశీలించి హాసీనాను ప్రత్యేకంగా అభినందించగా, వయోవృద్ధ, యువ గార్డెనర్లను ఈ సందర్భంగా సత్కరించారు.

## పసుమర్రు వద్ద దంపతులపై దాడి: కేసు నమోదు



చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 02 పసుమర్రు: తిమ్మాపురంలో బంధువుల వివాహానికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తున్న చీరాలకు చెందిన దంపతులు (షేక్ కాలేషావలి, షర్మిల) పై పసుమర్రు గ్రామం వద్ద దాడి జరిగింది. మార్గమధ్యలో సోడా తాగేందుకు ఆగగా, పసుమర్రుకే చెందిన షేక్ జాఫర్ సాదిక్ తన బైక్‌ను వారి ఆటోకు అడ్డు పెట్టి, స్నేహితులతో కలిసి దంపతులను తీవ్రంగా కొట్టి బెదిరించాడు. స్థానికులు అడ్డుకుని వారిని కాపాడారు. గాయపడిన దంపతులు చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. బాధితురాలు షర్మిల ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా పింగళి వెంకయ్య, బళ్ళారి రాఘవ జయంతి : జాయింట్ కలెక్టర్ ఆసుతోష్ శ్రీవాస్తవ



గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 2: భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, ప్రముఖ రంగస్థల కళాకారుడు బళ్ళారి రాఘవ జయంతి ఆదివారం ఘనంగా జరిగింది. కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఆసుతోష్ శ్రీవాస్తవ పింగళి వెంకయ్య, బళ్ళారి రాఘవ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి విశిష్ట సేవలు అందించిన మహనీయులను వారి జయంతి సందర్భంగా స్మరించుకోవడం, వారు సమాజానికి చేసిన సేవలను గుర్తుచేసుకోవడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధుడు దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున గర్వంగా ఎగురవేస్తున్న భారత జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య భారతదేశానికి చిరస్మరణీయమైన సేవ చేసిన మహనీయులని కొనియాడారు. కళారంగంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన బళ్ళారి రాఘవ నటనా వైభవం గొప్పదని చెప్పారు. క్రిమినల్ లాయర్ గాను ఆయన సేవలకు బ్రిటీష్ ప్రభుత్వ ప్రశంసలు కూడా పొందారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్టెప్ సి.ఇ. ఓ పి.వి. ఎన్. సత్యనారాయణ, కలెక్టరేట్ ఏ ఓ మల్లీశ్వరి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపు రూ.18 వేల కోట్ల నిధులు కేటాయించిన ప్రధాని మోదీకి బీజేపీ నేతల అభినందనలు



గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 2 : విజయనగరం జిల్లా భోగాపురంలో అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం రాష్ట్ర అభివృద్ధికి కీలక ఘట్టమని పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో సోలార్, విండ్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు, అనంతపురంలో విద్యుత్ ప్రసార వ్యవస్థ, విశాఖపట్నంలో సెమీకండక్టర్ తయారీ వంటి ప్రాజెక్టులకు భారీ నిధులు మంజూరు చేయడం అభివృద్ధికిదోహదపడుతుందని తెలిపారు. 2027 చివరి నాటికి అమరావతి రాజధాని తొలి దశ పనులు పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తామని, పోలవరం ప్రాజెక్టును కూడా జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై దర్శనపు శ్రీనివాస్ తీవ్ర విమర్శలు చేశారు. భోగాపురం విమానాశ్రయం విషయంలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు మానుకోవాలని అన్నారు. దేశభక్తి, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. రైల్వేలు, పోర్టులు, రహదారులతో అనుసంధానం మెరుగుపడి రవాణా వ్యవస్థ బలోపేతం అవుతుందని, భవిష్యత్తులో లక్షలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం చేకూరడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, సీనియర్ నాయకుడు పాలపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు పరిధిలో ఉన్న సొసైటీలో చైర్మన్ మార్పు చెల్లదని సభ్యుల ప్రకటన



చీరాల, పెన్ పవర్, ఆగస్టు 2: ఐటీసీ ఐఎల్టీడీ కో-ఆపరేటివ్ సొసైటీలో చైర్మన్ మార్పు జరిగిందంటూ వస్తున్న ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. ఇటీవల సొసైటీ చైర్మన్ వి.జె. ప్రసాద్ రాజీనామా చేసినప్పటికీ, సొసైటీ ఎన్నికలకు సంబంధించిన పిటిషన్ ట్రిబ్యునల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఆ రాజీనామా అమల్లోకి వచ్చే అవకాశం లేదని వారు తెలిపారు. సొసైటీ సభ్యుడు జాన్ దాఖలు చేసిన పిటిషన్ ప్రస్తుతం ట్రిబ్యునల్ పరిధిలో ఉన్నందున, చైర్మన్ రాజీనామాను జిల్లా సహకార అధికారి (డీసీఓ) ఆమోదించలేదని, కోర్టు పరిధిలో ఉన్న అంశాల్లో ఎలాంటి పరిపాలనా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేసినట్లు సభ్యులు వెల్లడించారు. ఇలాంటి పరిస్థితుల్లో పాలకవర్గంలోని వైస్ చైర్మన్ తన రాజీనామా ఆమోదించబడిందని, తానే చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు కొన్ని పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం పూర్తిగా అవాస్తవమని వారు ఆరోపించారు. కోర్టు పరిధిలో ఉన్న వ్యవహారాల్లో రాజీనామాలు, పదవి మార్పులు లేదా ఇతర పరిపాలనా నిర్ణయాలు అమల్లోకి రావని జిల్లా సహకార శాఖ అధికారులు స్పష్టం చేసినట్లు సభ్యులు తెలిపారు. అసత్య ప్రచారాలను సభ్యులు నమ్మవద్దని విజ్ఞప్తి చేసిన వారు, సొసైటీలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై చట్టపరమైన పోరాటాన్ని కొనసాగిస్తామని, సభ్యుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకు తమ ప్యానల్ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు.

## క్రాస్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

### 125 మందికి ఉచిత గుండె వైద్య పరీక్షలు, ఈసీజీ, ఎకో, రక్త పరీక్షలు



చీరాల, పెన్ పవర్, ఆగస్టు 2 : చీరాలలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో, గుంటూరు రమేష్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రెడ్ క్రాస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని రెడ్ క్రాస్ అధ్యక్షుడు, తహసీల్దార్ గోపీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపీకృష్ణ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఆరోగ్య పరీక్షలు ముందస్తుగా చేయించుకోవడం ద్వారా వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, సకాలంలో చికిత్స పొందే అవకాశం ఉంటుందని వివరించారు. గుంటూరు రమేష్ హాస్పిటల్‌కు చెందిన గుండె వైద్య నిపుణుడు డాక్టర్ నల్లమోతు కిరీటి రతన్, జనరల్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ సందీప్ రోగులను పరీక్షించి వైద్య సలహాలు అందించారు. రెడ్ క్రాస్ చైర్మన్ బూదరాజు శశికిరణ్ మాట్లాడుతూ, శిబిరంలో మొత్తం 125 మందికి గుండె వైద్య పరీక్షలు, ఈసీజీ, ఎకో, రక్త పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రతినెలా ఇలాంటి వైద్య సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ ప్రెసిడెంట్ సూరంపల్లి తేజస్వి, సెక్రటరీ జి.ఎ.వి. ప్రసాద్, మేనేజింగ్ కమిటీ సభ్యులు పసుపుల వందనం, ఫిరోజ్, త్రోవగుంట అబ్దుల్, తడవర్తి చంద్రశేఖర్, దమ్ము విజయభాస్కర్, పల్లపోతు విశ్వనాథం, కార్యవర్గ సభ్యులు ఎస్. పవన్ కుమార్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 'పార్లమెంట్ సాక్షిగా కూటమి కుట్రలు బహిర్గతం'




అమరావతి రాజధాని ప్రాంతంలో పేద ప్రజలకు నివసించే చోటే లేకుండా వెన్నుపోటు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి రాజధాని ప్రాంతంలో పేదలకు కనీసం ఒక్క ఇంటి స్థలం కూడా కేటాయించలేదని, కేంద్ర ప్రభుత్వానికి కనీసం ప్రతిపాదనలు కూడా పంపలేదని పార్లమెంట్ సాక్షిగా వాస్తవాలు వెల్లడయ్యాయని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 51 వేల మంది పేద మహిళల పేరిట 1,400 ఎకరాల్లో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు చేయిస్తే, వెన్నుపోటు కూటమి ప్రభుత్వం రాగానే ఆ ఇళ్లను, స్థలాలను రద్దు చేసి పేదల కళ్లలో నీళ్లు తెప్పించారని మండిపడ్డారు. అమరావతిని కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, స్వంత మనుషులకు, బినామీలకు మాత్రమే పరిమితం చేస్తున్నారని దేవినేని అవినాశ్ ధ్వజమెత్తారు.

**వైఎస్ జగన్ ఇచ్చిన 51 వేల ఇళ్ల పట్టాలు రద్దు చేశారు :** కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇచ్చిన సమాధానం ద్వారా ఈ కూటమి ప్రభుత్వ నైజం బయటపడింది. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ – అర్బన్ 2.0)' కింద ఆంధ్రప్రదేశ్ నుంచి వేలాది ఇళ్ల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినప్పటికీ, అమరావతి ప్రాంతంలో నివసించే పేదల కోసం ప్రభుత్వం ఒక్క ఇల్లు లేదా స్థలం ప్రతిపాదన కూడా పంపలేదు. జూన్ 2026 నాటికి 107 పట్టణాల్లో 12 వేల ఇళ్లకు ఆమోదం లభిస్తే, అమరావతిలో ఒక్క పేద కుటుంబానికి కూడా ఇల్లు కేటాయించకపోవడం దారుణం.

అమరావతి అందరిదీ, ప్రపంచ రాజధాని అని గొప్పలు చెప్పే చంద్రబాబు.. అక్కడ పేదవాళ్లు నివసించడానికి ఎందుకు ఇష్టపడటం లేదు? గతంలో వైఎస్ జగన్ హయాంలో సీఆర్డీఏ చట్టం సెక్షన్ 53(1)(డి) ప్రకారం 5 శాతం భూమిని పేదలకు కేటాయించి.. 51 వేల మంది మహిళల పేరిట 1,400 ఎకరాల్లో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు చేయించాం. కానీ మీరు అధికారంలోకి రాగానే ఆ ఇళ్లను, స్థలాలను రద్దు చేసి పేదల కళ్లలో నీళ్లు తెప్పించారు.

**రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, బినామీల కోసమే తపన**

రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ చంద్రబాబు.. అమరావతిని కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, తన సొంత మనుషులకు, బినామీలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు. 'మావిగన్' (మచిలీపట్నం–విజయవాడ–గుంటూరు–తెనాలి) అర్బన్ కారిడార్ అభివృద్ధిపై వైఎస్ జగన్ ఇచ్చిన ప్రతిపాదనతో షాక్‌కు గురైన చంద్రబాబు, చివరకు అమరావతి అంటే 29 గ్రామాలు మాత్రమే కాదని, విజయవాడ–గుంటూరు కూడా అమరావతిలో భాగమేనంటూ ఒప్పుకోక తప్పలేదు. అమరావతి కోసం తెచ్చిన రూ.47 వేల కోట్ల అప్పులకు, అసలు–వడ్డీలు కట్టడానికి ప్రజల ఖజానా సొమ్మునే వాడుతూ, సెల్ఫ్ ఫైనాన్స్ మోడల్ అని ప్రజలను మోసం చేస్తున్నారు. చంద్రబాబు, మీరందరూ వైఎస్ జగన్ పాలనా అనుభవాన్ని చూసి నేర్చుకోవాలి. ఆయన ప్రతిపాదించి శంకుస్థాపన చేసిన భోగాపురం ఎయిర్‌పోర్టులో ప్రతి ఇటుకపైనా వైఎస్ జగన్ పేరే ఉంటుంది. అమరావతిలో ఇళ్లు రద్దు చేసిన ఆ 50 వేల మంది మహిళలకు, పేదలకు ఈ కూటమి ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలి. రాబోయే రోజుల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని దేవినేని అవినాశ్ హెచ్చరించారు.

## రేషన్ షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 2: పేద, మధ్యతరగతి కుటుంబాలకు తక్కువ ధరలకు సన్న బియ్యం అందించేందుకు చుట్టుగుంట రైతు బజార్‌లో ప్రత్యేక విక్రయ కేంద్రాన్ని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రారంభించారు. మార్కెట్ ధర కంటే తక్కువకు సన్న బియ్యం, స్టీమ్ బియ్యం అందిస్తున్నామని తెలిపారు. రేషన్ పంపిణీలో పారదర్శకత కోసం పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని రేషన్ దుకాణాల్లో 10 రోజుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పూర్తి చేస్తామని చెప్పారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా, మాల్‌ప్రాక్టీసులకు పాల్పడితే లైసెన్సులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



మచిలీపట్నం, పెన్ పవర్,ఆగస్టు 1 : ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డా. తోట ప్రేమ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో నివాసం ఉంటున్న బాలికలతో కలిసి డా. ప్రేమ్ కుమార్ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం బాలికలకు కేక్ పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే సందర్భంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ నిరుపేద వృద్ధ మహిళకు నెల రోజులపాటు సరిపడా బియ్యం, పప్పులు, వంటనూనెతో పాటు ఇతర నిత్యావసర సరుకులను అందజేశారు. సేవా కార్యక్రమాలను స్థానికులు అభినందించారు. ఈ సందర్భంగా డా. తోట ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రత్యేక సందర్భాలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం వల్ల నిజమైన సంతృప్తి లభిస్తుందని అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించి అవసరంలో ఉన్న వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండే డా. తోట ప్రేమ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, హాస్టల్ నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# అభ్యంతరాలను తెలియజేయండి

### రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇన్‌చార్జ్ కలెక్టర్ నవీన్

ముసాయిదా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు ఉంటే నిర్దేశిత గడువులోగా తెలియజేయాలని కృష్ణా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. సర్ 2026లో భాగంగా శుక్రవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన చాంబర్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాల హేతుబద్దీకరణ, క్లయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలను ఆయన వివరించారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ జూన్ 15 నుంచి జూలై 24వ తేదీ వరకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం బూత్‌లెవల్ అధికారులు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసి తిరిగి సేకరించారన్నారు. ఈ ప్రక్రియలో బీఎల్వోలు, బీఎల్ఏలు, ఈఆర్వోలతో దశలవారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించి ప్రతి అంశాన్ని పర్యవేక్షించామన్నారు.

**వారి పేర్లు పొందుపరచలేదు :** అందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందాయని అయితే వారిలో మరణించిన వారు, వలస వెళ్లిన వారు, డూప్లికేట్ నమోదు, చిరునామా తెలియని వారు, ఇతర కారణాలతో వాటిని సమర్పించని వారు ఉన్నారన్నారు. వారి పేర్లు పొందుపరచలేదని ఈ జాబితాను రాజకీయ పార్టీలకు అందజేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రం, ఈఆర్వో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజల పరిశీలన కోసం జాబితాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారి వెబ్‌సైట్‌లో ముసాయిదా జాబితా అందుబాటులో ఉంటుందన్నారు. క్లయిమ్‌లు, అభ్యంతరాల నోటీసులపై వచ్చిన వివరణలు, విచారణలను సెప్టెంబరు 28వ తేదీలోగా పూర్తి చేసి అక్టోబరు 3వ తేదీ తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు షేక్ సలార్‌దాదా, కొడాలి శర్మ, బీఎంపీ దాస్, బి విజయకుమార్, కె.చంద్రశేఖర్, కూనపరెడ్డి శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం డెప్యూటీ తహసీల్దార్ వై.నారాయణ తదితరులు ఉన్నారు.

# భోగాపురంపై క్రెడిట్ చోరీకి పాల్పడిందికాక...

# వై.యస్. జగన్ పై కాలకూట విషం చిమ్ముతారా...!

**భోగాపురం ఎయిర్ పోర్ట్ ప్రారంభోత్సవంలో చంద్రబాబు, పవన్, లోకేష్ వి ఉత్తర కుమార ప్రగల్భాలు.**
**ప్రతిపక్షాలపై విరుచుకుపడే ప్రధాని మోదీ,జగన్ ను విమర్శించకపోవడం జగన్ విశ్వసనీయతకు నిదర్శనం.**
**తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రెద్యం వెంకట సుబ్బారెడ్డి.**

**ఖాజీపేట: ఆగస్టు 2 :** భోగాపురం ఎయిర్పోర్ట్ విషయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ లు క్రెడిట్ చోరీకి పాల్పడింది కాక... భోగాపురం పనులను దాదాపు పూర్తిచేసినప్పటికీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పై కాలకూట విషం చిమ్మడంపై వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెద్యం వెంకటసుబ్బారెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకపడ్డారు. ఖాజీపేట మండలం, దుంపలగట్టు లోని ఆయన స్వగృహంలో ఆదివారం ఉదయం రెద్యం విలేకరులతో మాట్లాడుతూ వైయస్ జగన్ సర్కార్ లో భోగాపురం ఎయిర్పోర్ట్ కోసం భూమిని సేకరించడంతో పాటు,నిర్వాశితులకు పునరావాసం కల్పించడం, అనుమతులు పొందడం, హైకోర్టు,ఎన్జీటీలో దాఖలైన వందకు పైగా కేసులను పరిష్కరించి దాదాపు 80 శాతం పనులను పూర్తిచేస్తే... మిగతా 20 శాతం పనులు పూర్తిచేసిన చంద్రబాబు నాయుడు పబ్లిసిటీలో ఫీక్, పనుల్లో వీక్ గా ఉండి, క్రెడిట్ చోరీకి పాల్పడింది కాక వైయస్ జగన్ పై గ్లోబెల్స్ అమ్మ మొగుడిలా ప్రచారం చేయడం కూటమి ప్రభుత్వ నీచ రాజకీయానికి పరాకాష్ట అని ఆయన ఎద్దేవా చేశారు. ఎయిర్పోర్ట్ కు 15 వేల ఎకరాల భూమి కావాలని చంద్రబాబు నాయుడు అన్న మాటలపై రెడ్ బస్ అనే మాటను అక్కడ నిరసనకు వచ్చిన అమ్మాయి మాట్లాడితే ఆ అమ్మాయి మాటలను వైయస్ జగన్ అన్నారంటూ వక్రీకరించి పదేపదే విషం చిమ్మడం చంద్రబాబు,పవన్,లోకేష్ లకే చెల్లిందని ఆయన మండిపడ్డారు. భోగాపురం



ఎయిర్పోర్ట్ ను తామే సాధించామని ప్రధాని మోదీ సాక్షిగా ఆ సభలో చంద్రబాబు,పవన్,లోకేష్ లు ఉత్తమకుమార ప్రగల్భాలు పలికారని,వచ్చి అబద్ధాలు నిస్సిగ్గుగా మాట్లాడారని ఆయన ధ్వజమెత్తారు. భోగాపురం ఎయిర్పోర్ట్ తాము సాధించామని గొప్పలకు పోయిన కూటమినేతలు ఎయిర్పోర్ట్ కు వెళ్లే బీచ్ రోడ్డు విస్తీర్ణ పనులను పట్టించుకోలేదని ఇదేనా వారి చిత్తశుద్ధి అంటూ మండిపడ్డారు. ఏ రాష్ట్రానికి వెళ్లి సభలు,సమావేశాలు పెట్టినా ప్రధాని నరేంద్ర మోడీ ఆ రాష్ట్రంలోని ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుక పడతారని కానీ ఇక్కడ వైయస్ జగన్ ను పల్లెత్తు మాట అనకపోవడానికి కారణం వైఎస్ జగన్ విశ్వసనీయతనే అని ఆయన స్పష్టం చేశారు. స్వయాన కూటమిలో ప్రధాన భాగ స్వామి అయినా బిజెపి శాసన పక్ష నేత విష్ణుకుమార్ రాజు విశాఖపట్నం నుండి భోగాపురం వెళ్లేందుకు రెండు గంటలు పడుతుందని, అక్కడ విమానం కోసం గంటన్నర ఎదురు చూడాలని, దానికి బదులు వందేభారత్ రైలు ఎక్కితే నాలుగు గంటల్లో విజయవాడకు వెళ్ల వచ్చునని స్పష్టంగా చెప్పారని దీనిపై దమ్ము, ధైర్యం ఉంటే సమాధానం చెప్పాలని రెద్యం సవాల్ విసిరారు.

# కడప జిల్లా ఎపిఎస్ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక



**కడప, ఆగస్టు 2: జన వేల ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ (ఎపిఎస్ జేఏసీ ) కడప జిల్లా నూతన కమిటీని ఆదివారం కడప ప్రెస్ క్లబ్ లో ప్రకటించారు. ఎపిఎస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డి.వి. కృష్ణ యాదవ్ ఆదేశాల మేరకు జిల్లా కమిటీని ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఇడగొట్టి ప్రభు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వెంకట సురేష్, వెంకట అరవింద్, కార్యదర్శులుగా నితీష్, పవన్ కుమార్ రెడ్డి, గురునాథ్ యాదవ్, ప్రభు, నవీన్, అరవింద్, నాజీబ్ ఖాన్, అబ్రార్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎపిఎస్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. ఉత్తన్న, జిల్లా అధ్యక్షుడు ఇడగొట్టి ప్రభు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో యూనిఫాం విక్రయాల పేరుతో తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు. తమిళనాడు తరహాలో ఫీజుల నియంత్రణకు సమగ్ర చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థి సంఘాలు, మీడియా ప్రతినిధుల ప్రవేశంపై విధించిన ఆంక్షలను వెంటనే తొలగించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని, ఎస్సీ , ఎస్టీ , బిసి , మైనారిటీ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లకు తల్లిదండ్రుల నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని, పాఠశాల ఫీజులు, బోధనా సిబ్బంది వివరాలను నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలని కోరారు. రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న ఉద్యోగాలు, విశ్వవిద్యాలయాల్లో లెక్చరర్ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, నిరుద్యోగ భృతి అందించాలని ఎపిఎస్, జెసిఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# కడపలో శుభకార్యాలకు హాజరైన కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి



**కడప టౌన్ ఆగస్టు 2 :** కడపలో వేంపల్లి టీడీపీ నాయకులు షబ్బీర్ కుమారుడు వివాహ వేడుకలో, అలాగే కాల్ టాక్స్ హబీబుల్లా మనవరాలు నిశ్చితార్థ వేడుకలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను, నిశ్చితార్థం చేసుకున్న జంటను ఆశీర్వదించిన మాధవి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో నిండాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువులు, పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# టిడిపి ఇంటింటి కార్యక్రమం

## : ఎమ్మెల్యే మాధవి రెడ్డి



**కడప ఆగస్టు 2 :** కడప నగరంలోని 13వ డివిజన్ ఓంశాంతి నగర్ లో నిర్వహించిన ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమం డివిజన్ ఇంచార్జి సుబ్బరాయుడు యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డెప్పగారి మాధవి రెడ్డి పాల్గొన్నారు. ఆదివారం ఈ సందర్భంగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సామాజిక భద్రతను అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని ఆమె పేర్కొన్నారు. పింఛన్లు ప్రతి ఇంటికీ గౌరవప్రదంగా చేరేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో ఆప్యాయంగా ముచ్చటించిన శ్రీమతి మాధవి రెడ్డి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు రామ్ లక్ష్మణ్ రెడ్డి, కుమార్, షేక్ కలీం, సభాపతి, అంకయ్య, వంశీ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముద్ద నూరు ప్రాజెక్టు ఎర్రగుంట్ల సెక్టర్లో అర్హత లేని వారికి ప్రమోషన్లు ఇచ్చిన వారిపై విచారించి చర్యలు తీసుకోవాలి.

**సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్**



**కమలాపురం ఆగస్టు 2 :** కడప వైఎస్ఆర్ జిల్లా పాత కమలాపురం ప్రాజెక్టు ,ప్రస్తుత ముద్దనూరు ప్రాజెక్టులోని ఎర్రగుంట్ల మండలంలో ఐసిడిఎస్ డిపార్ట్మెంట్ నందు అర్హత లేకుండా హెల్పర్స్ నుంచి టీచర్లగా కొందరికి ప్రమోషన్లు ఇచ్చారని వీటి పైన విచారించి చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మనోహర్, లక్ష్మీదేవి, జిల్లా కోశాధికారి వెంకటసుబ్బయ్య లు ఒక సంయుక్త ప్రకటనలో ఐసిడిఎస్ అధికారులను డిమాండ్ చేశారు. ముఖ్యంగా అర్హత ఉన్నవారికి ఇవ్వాల్సిన అవసరం ఉన్నది అని తెలిపారు. అలా కాకుండా గతంలో పనిచేసిన ఒకరిద్దరి క్లర్కుల సహాయంతో అవినీతి అక్రమాలకు పాల్పడి అర్హత లేని వారికి ఇచ్చినట్టు పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది అన్నారు. వీటి పైన రాతపూర్వకంగా జిల్లా కలెక్టర్ గారికి అందజేస్తామని తెలిపారు. కనుక వీటిపైన విచారించి కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నిజమైనటువంటి అర్హులకు అందేలా చూడాలని కోరారు.

# మైలవరం జలాశయం నుండి ఉత్తర కాలువకు నీరు విడుదల.

**ఉత్తర కెనాల్ మరియు ఎన్.బి.సి ను పరిశీలించిన ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి.**



**జమ్మలమడుగు ఆగస్ట్ 02 :** మైలవరం జలాశయం నుండి ఉత్తర కెనాల్ కీ నీరు విడుదల చేయనందున శనివారం ఎమ్మెల్సీ పోన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి మరియు రైతులు కలసి మైలవరం జలాశయంను సందర్శించరు. నీరు లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయి..సకాలంలో నీరు ఇవ్వకపోతే మినుము, పత్తి, మిరప, మొక్క జొన్న రైతుల పరిస్థితి దయనీయంగా తయారవుతుందని,సకాలంలో నీరందించి రైతన్నని ఆదుకోవాలని రైతులతో కలసి రామసుబ్బారెడ్డి కలెక్టర్ కు మరియు ఇరిగేషన్ చీఫ్ శశిభూషన్ ను కోరిని విషయం మనశీదరికి తెలిసిన విషయమే. రైతుల విజ్ఞప్తి మేరకు మైలవరం జలాశయం నుండి ఉత్తర కాల్వ కీ నీటిని విడుదల చేసిన శుభసందర్బంగా కెనాల్ నందు నీటిని పరిశీలించి రైతుల తరుపున సంబంధిత అధికారులకు ధన్యవాదములు తెలియచేసిన ఎమ్మెల్సీ పోన్నపురెడ్డి రామ సుబ్బారెడ్డి, ఎస్.ఈ.సీ. మెంబెర్ గిరిధర్ రెడ్డి. ఈ కార్యక్రమములో చిన్న కొమ్మెర్ల మోహన్ రెడ్డి , మోరగుడి ఉప సర్పంచ్ రాఘవేంద్ర రెడ్డి, పెద్దముడియం మండల ప్రెసిడెంట్ విషు వర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో బీసీ ఎమ్మెల్యేకు రక్షణ కరువు.

**ఎమ్మెల్యే పై కక్ష సాధింపు చర్యలో భాగంగానే అక్రమ అరెస్టు,కేసు నమోదు.**
**ఆలూరు ఎమ్మెల్యే వీరుపాక్షి అక్రమ అరెస్టును ఖండించిన వైయస్సార్సీపి గుంతకల్ నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు పెద్దినేని రంగనాయకులు.**

**గుంతకల్ జన వేళ ప్రతినిధి ఆగస్టు 2 :** ఆలూరు నియోజవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బీసీ కులానికి చెందిన బోయ బూసినేని విరుపాక్ష గారిని పోలీసులు అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేయడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లో బీసీ కులాలకు చెందిన ఒకే ఒక్క ఎమ్మెల్యే ఉన్నాడన్న దురుద్దేశంతో ఆ ఎమ్మెల్యేని అవమానాల గురి చేస్తే పార్టీకి దూరమైతాడనే దురుద్దేశంతో ఎమ్మెల్యే వీరుపాక్షి గారిని ఇలా మానసిక ఒత్తిడికి గురి చేసిన,కూటమి నాయకులు ఎన్ని కుట్రలో కృతంతాలు పొందిన రానున్న రోజుల్లో అదే ఆలూరు నియోజకవర్గం లో బూసినేని వీరపాక్ష గారు మళ్లీ ఎమ్మెల్యే అవుతారని ఈ కూటమి ప్రభుత్వానికి ఎదురెళ్లి పనిచేసిన ఎమ్మెల్యే విరపాక్ష గారిని రెడ్ బుక్కు రాజ్యాంగం లో ఇదొక భాగంలో బీసీ కులానికి చెందిన బోయ కులస్తుడైన ఎమ్మెల్యే గారిని అణచివేయడానికి స్థానిక నాయకులతో పోలీస్లు కుమ్మక్కై చేసిన డ్రామాగా భావిస్తున్నామన్నారు.

**రానున్న రోజుల్లో స్థానిక ఎంపీటీసీ,జడ్పీటీసీ సర్పంచ్ ఎలక్షన్ రాబోతున్న సందర్భంలో ముందస్తు ప్రణాళికతో కూటమి నేతలు**

ఎమ్మెల్యే విరుపాక్ష ని టార్గెట్ చేస్తూ ప్రణాళికంగా ముందుగానే సిద్ధం చేసుకుని ఆయన మీద అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి ఆయన కుటుంబాన్ని బాయబాంతలకు గురి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు అన్నారు. అంతేకాకుండా ఆలూరు నియోజవర్గంలో ఎక్కువ శాతం బీసీలే




బోయ కులస్థలే ఉన్నారు కాబట్టి వాళ్లని ఇప్పటినుంచే అనిచివేయాలని ఈ కూటమి ప్రభుత్వం కుట్ర పొంది రానున్న రోజుల్లో ఏ పంచాయితీలోనైనా అభ్యర్థులు ముందుకు రాకూడదని బీసీలను ముందుకు రానీయకుడదని ఒక దురుద్దేశంతో స్థానిక సంస్థ ఎన్నికల్లో మూడు నెలలు ముందుగానే నియోజవర్గంలో అల్లర్లు సృష్టిస్తున్నారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఏ ఒక్క నాయకుడు ముందుకు రాకూడదనే ప్రణాళికతో ఎమ్మెల్యే విరుపాక్ష గారిని, వారి సోదరుడు శ్రీరాములుని, వారి కుమారుడు చంద్రశేఖర్ను మరికొందరు వైఎస్ఆర్సిపి నాయకులను అక్రమంగా అరెస్టు చేసి ఆయన వర్గీలను భయానికి గురిచేసి ఆ వర్గాన్ని ఎమ్మెల్యేకి దూరం చేయాలనే దురుద్దేశంతోనే ఈ అక్రమ కేసులు అక్రమ అరెస్టులు జరిగినట్లు స్పష్టంగా ఉందన్నారు. ఎన్ని జరిగినా ఎమ్మెల్యే విరుపాక్ష గారు ధైర్యంతో ముందుకెళ్లి నియోజకవర్గంలో ఉన్నటువంటి కార్యకర్తలని ముందుకు తీసుకొని పోయే పార్టీ కి బలం చేకూర్చే దానికి ఎప్పుడు ముందుంటారన్నారు. రానున్న రోజుల్లో మా వైస్సార్సీపీ ప్రభుత్వం వస్తుంది వచ్చిన తర్వాత ఇంతకు రెండింతలు ప్రజాభివృద్ధి చేసి రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపించి రాష్ట్రంలో ఉన్న ప్రజలతోనే కూటమి పెద్దలకు నాయకులకు కార్యకర్తలకు వాళ్లకు సహకరించినటువంటి పోలీస్ అధికారులను తగిన గుణపాఠం చెప్పించడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉందన్న విషయాన్ని మర్చిపోతున్నారు అన్నారు. మీరు ఎన్ని కుట్రలు పొందిన ఎన్ని అక్రమ కేసులు పెట్టిన మా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎవరు కూడా వెనక్కి తగ్గే ప్రసక్తి లేదన్నారు. మీరు ఈరోజు చూపిస్తున్నటువంటి రెండు రాజ్యాంగంలో ఈరోజు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి గారి పైన జరిగినటువంటి అక్రమ కేసును వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ తరపున ఖండిస్తున్నామన్నారు. వెంటనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బుసినేని విరుపాక్షి గారిని, వారి తమ్ముడు శ్రీరాములు గారిని, యువ నాయకుడు ఉసినేని చంద్రశేఖర్ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో బీసీ లందరూ కలిసి కుటమి ప్రభుత్వాన్ని తప్పకుండా గద్దె దింపుతారని పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

# తిరుపతి ఐఐటీ త్రైపాక్షిక ఒప్పందం

ఏర్పేడు: రాష్ట్రంలో సౌర ఉత్పాదక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు తిరుపతి ఐఐటీ, ఆస్ట్రేలియా సిడ్నీ యూఎన్ఎస్ డబ్ల్యూ, కోఈఈటీలతో అమరావతిలో జరిగిన ఓ సదస్సులో త్రైపాక్షిక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంత్రి నారా లోకేష్ సమక్షంలో తిరుపతి ఐఐటీ, ఆస్ట్రేలియాలోని సిడ్నీకి చెందిన యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (యూఎన్ఎస్డబ్ల్యూ), విశాఖపట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (కోఈఈటీ)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సౌర ఫోటోవోల్టాయిక్ ఉత్పాదక రంగం, రీసైక్లింగ్, విద్య, కార్మిక శక్తి అభివృద్ధి, పారిశ్రామిక భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో మూడు సంస్థలు సమష్టిగా కలసి పని చేస్తాయని ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థల సహకారంతో సోలార్ సెల్ తయారీ, విశ్వసనీయత ఇంజనీరింగ్ లో తన పరిశోధనా నైపుణ్యాన్ని అందిస్తుందన్నారు. తిరుపతి ఐఐటీ ఈ కేంద్రాన్ని స్థాపించడానికి విద్యా మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు, పరిశోధన సహకారాన్ని అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏపీఎస్పీ డీసీఎల్ ఈఈటీ చీఫ్ జీఎం డీ.సుమన్ కళ్యాణి, సిడ్నీ యూనివర్శిటీ ప్రో వైస్--చాన్సలర్ ఇంటర్నేషనల్ ప్రొఫెసర్ లిజా జాంబర్లాన్, ఐఐటీ డీన్ ప్రొఫెసర్ అరుణ్ కె.తంగిరాల పాల్గొన్నారు.

# కడప తాగునీటి సంక్షోభానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం



**కడప, ఆగస్టు 2: జన వేళ ప్రతినిధి :** కడప నగరంలో నెలకొన్న తాగునీటి కొరతకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య ఆరోపించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న అన్ని నీటి వనరులను వినియోగించి ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. మైలవరం ప్రాజెక్టు నుంచి పెన్నా నదిలోకి నీటిని విడుదల చేసినప్పటికీ, ప్రత్యామ్నాయ నీటి వనరులపై అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించలేదని విమర్శించారు. అమృత్ 2.0 పథకం కింద బ్రహ్మంసాగర్ నుంచి కడపకు ముడి నీటిని అందించే ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని కోరారు. ప్రజలను నీటిని పొదుపు చేయాలని కోరడంతో పాటు, వారికి సరిపడా తాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అబ్దుల్ సత్తార్, సిరాజుద్దీన్, దాసరి శ్రీనివాసులు, మామిళ్ల బాబు, చిన్న కుల్లాయప్ప, గంగయ్య, షామీర్ హుస్సేన్, చాన్ బాషా, జాబిర్ అలీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సీట్ల ప్రవేశాల్లో జీవో 102 రద్దు చేయాలి

**హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఉత్తర్వులు తగదు**
**పాత జీవో 151 జారీ యథాతథంగా ఉండాలి**
**రిజర్వేషన్ వర్గాలకు అన్యాయం లేకుండా చూడాలి**
**: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**

**కడప జన ఆగస్టు 2:** డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహిస్తున్న వైద్య సీట్ల ప్రవేశాల్లో జీవో 102 రిజర్వేషన్ వర్గాల విద్యార్థులకు తీవ్ర నష్టదాయకమని, తక్షణమే ప్రభుత్వం దానిని రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. వైద్య కళాశాలల ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీవో 102 (30.7.2026)న జారీచేయడం ఈ విద్యా సంవత్సరంలో నీట్ ద్వారా ఎంబీబీఎస్ తదితర కోర్సుల ప్రవేశాలు గందరగోళంగా మారనున్నాయని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జీవో రాష్ట్ర హైకోర్టు డబ్ల్యూపీ నంబరు 11018 (2029) కేసులో ఇచ్చిన సూచనలకు విరుద్ధంగా ఉందన్నారు. 2019లో ఎన్టీఆర్ హెల్త్ యనివర్శిటీ ద్వారా జరిగిన వైద్య సీట్ల ప్రవేవాల్లో రిజర్వేషన్ వర్గాల విద్యార్థులకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా ఆనాడు ఆయా విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. దీంతో హైకోర్టు అడ్మిషన్లు పారదర్శకంగా నిర్వహించేలా, రిజర్వేషన్ల స్ఫూర్తి దెబ్బ తినకుండా ఉండేలా, ఆరుగురు నిపుణులతో ఒక కమిటీ వేసి వారు చేసిన సూచనలకు అనుగుణంగా అడ్మిషన్ నిర్వహించాలని సూచించిందన్నారు. దానికి అనుగుణంగా ఆనాటి ప్రభుత్వం 16.3.2020వ తేదీన ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను, ఇద్దరు ఉన్నత విద్యావేత్తలను, ఇద్దరు సీనియర్ హైకోర్టు న్యాయవాదులతో ఒక కమిటీని వేశారని వివరించారు. వారిచ్చిన సూచనల మేరకు 4.12.2020 వ తేదీన జీఓ ఎంఎస్ నంబరు-151 జారీ చేసిందన్నారు. అప్పటి నుంచి ఆ జీవోని అనుసరించే వైద్య సీట్ల కు ప్రవేశాలు కొనసాగుతున్నాయని తెలిపారు. హైకోర్టు ఆదేశాలతో జీవో 151 అమలు చేయడం వలన ఎవరికీ, ఎలాంటి నష్టం జరిగినట్లు ఇంతవరకు ఫిర్యాదులు లేవన్నారు. అప్పటి వరకు వైద్య సీట్ల భర్తీలో అనేక సమస్యలు తలెత్తడంతో జీవో 151 రావడానికి కారణమైందని తెలిపారు. అంటే చాలా మంది రిజర్వేషన్ వర్గాలు మంచి ర్యాంక్ తెచ్చుకుని వాళ్లు ఓపెన్ కేటగిరిలో మంచి సీటు సాధించే అవకాశం ఉన్నప్పటికీ..వారు ఆప్షన్లు సరిగ్గా పెట్టుకోకపోవడంతో చివరకు ర్శిర్వేషన్ కేటగిరీలోనే సీట్లు కేటాయించే వారని వివరించారు. దానివల్ల అనేక మంది రిజర్వేషన్ వర్గాల వారు నష్టపోయేవారని వివరించారు. ఐదారు సంవత్సరాల నుంచి ఆ జీవో ప్రకారమే ఎంబీబీఎస్ ప్రవేశాలు కొనసాగుతున్నాయని, ఎలాంటి ఇబ్బందులు లేవని పేర్కొన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ఆల్ ఆప్షన్లు పెట్టే విధానాన్ని తొలగించినట్లయితే..ఆ జీవో స్ఫూర్తి దెబ్బతింటుందని తెలిపారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం జారీజేసిన జీవో ప్రకారం, జనరల్ కేటగిరీలో సీటు పొందగలిగిన రిజర్వేషన్ అభ్యర్థి, తాను అన్ని ఆప్షన్లు పెట్టినప్పుడు అతడ్ని జనరల్ కేటగిరీ కింద కేటాయించకుండా తీసుకెళ్లి రిజర్వేషన్ కేటగిరీలో కేటాయించేలా ఉంటుందన్నారు. అంటే ర్యాంక్ చూస్తే ఓపెన్ కేటగిరిలో ఉన్నప్పటికీ, సీట్ మాత్రం రిజర్వేషన్ లో ఇస్తారని పేర్కొన్నారు. దీని ఆధారంగా రిజర్వేషన్ లో రావాల్సిన ఒక సీటు పోతుందన్నారు. రాబోయే వైద్య సీట్ల ప్రవేశాల్లో ఈ జీవో వల్ల తక్కువ ఆప్షన్లు పెట్టే రిజర్వేషన్ విద్యార్థులకు అనేక సమస్యలు తలెత్తే ప్రమాదముందని తెలిపారు. అన్ని వర్గాల విద్యార్థులకు న్యాయం జరగాలంటే తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 102 జీవోను రద్దు చేసి, పాత జీవో 151ను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# యువకుడిపై కత్తులతో దాడి

**-చికిత్స పొందుతూ మృతి**

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో ఓ యువకుడిపై కత్తులతో దాడి చేయడం కలకలం రేపింది. వివరాలు.. పట్టణంలోని స్వర్ణముఖి కరకట్ట మీద కొండమిట్ట ప్రాంతానికి చెందిన శివ(34) అనే యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు గాయపడిన శివను స్థానిక ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శివ మృతి చెందినట్లు సమాచారం. ఘటనపై శ్రీకాళహస్తి ఒకటో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు స్పందిస్తూ, హత్యకు దారితీసిన పరిస్థితులపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితులను త్వరలోనే గుర్తించి అరెస్టు చేస్తామని పేర్కొన్నారు. ఈ ఘటనకు గల కారణాలు, దాడికి పాల్పడిన వ్యక్తుల వివరాలు ఇంకా తెలియరాలేదన్నారు.

# నైపుణ్యానికి వయసుతో పనిలేదు

## స్నేహ బంధం సేవాశక్తిగా మారాలి : కాంగ్రేగుల వెంకటరమణ పిలుపు

**కడప టౌన్ ఆగస్టు 2 అనకాపల్లి :** వయసుతో సంబంధం లేకుండా నిలదొక్కుకోవాలంటే 'నైపుణ్యాల అప్‌గ్రేడేషన' అత్యవసరమని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ కమిటీ సభ్యులు, వినియోగదారుల రక్షణ, ఆర్టీఐ చట్టాల ఇన్‌ఫ్లుయెన్సనర్ కాంగ్రేగుల వెంకటరమణ స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని కర్రి జగన్నాథరావు ఏసీ ఫంక్షన్ హాలులో మున్సిపల్ గవరపాలెం హైస్కూల్ 1994–1995 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన, కంటి వైద్య శిబిరాలకు కాంగ్రేగుల వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలో క్రియేటర్‌గా, లీడర్‌గా ఎదగాలనుకునే ఔత్సాహికులకు 'కెరీర్ గైడెన్స' దిశానిర్దేశం చేస్తుందన్నారు. సృజనాత్మకతకు వయసుతో పనిలేదన్నారు. ఏ రంగంలో ఉన్నా డిజిటల్ టూల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మొదలగు ఆధునిక సాంకేతిక సాధనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మూస పద్ధతులకు స్వస్తి పలికి, భిన్నంగా ఆలోచించడం ప్రారంభించాలన్నారు. నాయకత్వం అంటే కేవలం ఆదేశాలు జారీ చేయడం కాదు, బృందాన్ని స్ఫూర్తివంతంగా నడిపించడం.



దీనికి సాఫ్ట్ స్కిల్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో కీలకమన్నారు. ఒకే ఆలోచనలు ఉన్న వ్యక్తులతో నెట్‌వర్కింగ్ పెంచుకోవాలని ఆయన హితవు పలికారు. స్నేహితుల కలయిక పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడానికే పరిమితం కాకూడదు. ప్రజా సమస్యల పరిష్కారం, ఆర్టీఐ, వినియోగదారుల హక్కులు, ప్రజా ప్రయోజన చట్టాలు వినియోగం, హక్కుల సాధనలో ముందుండాలన్నారు. వ్యక్తిగత విజయాన్ని సమాజ సేవతో ముడిపెట్టినప్పుడే జీవితం సార్థకమవుతుంది. 'స్నేహితుల చేతులు కలిస్తే సేవా శక్తి పుడుతుంది ... అదే అభివృద్ధి చెందిన సమాజానికి నిజమైన పునాది' అని ఆయన ఉద్ఘాటించారు. సాంకేతిక విప్లవం మనుషులను భౌతికంగా దగ్గర చేసినా, మనసులను కలిపేది మాత్రం పాఠశాల స్థాయిలో మొదలైన స్వచ్ఛమైన స్నేహమేనని ఆయన అభిప్రాయపడ్డారు. స్నేహం, సేవ, సామాజిక బాధ్యతలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన పూర్వ విద్యార్థుల బృందాన్ని కాంగ్రేగుల వెంకటరమణ అభినందించారు. ప్రభుత్వ అసిస్టెంట్ ప్రొఫెసర్ విల్లూరి అప్పలనాయుడు భాగవతం, భగవద్గీత ప్రాధాన్యతలను వివరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కె.ఎం.నాయుడు మాట్లాడుతూ ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్న సహచర మిత్రులను ఆదుకోవాలన్న క్ష్యంతో ఈ బ్యాచ్ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు శకకడం పవన్, పి.అనిల్‌కుమార్, అమ్మ బ్లడ్ బ్యాంకు, నటరాజ్ ఆప్టికల్స్ కంటి వైద్యులు, 1994–1995 బ్యాచ్ ప్రతినిధులు విల్లూరి రాముడు, కాంగ్రేగుల శశి, కొణతాల సంతోష్, కర్రి భాను తదితరులు పాల్గొన్నారు. అనంతరం 10, ఇంటర్, ఐఐటీ, మెడిసిన్ విభాగాల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలతో విద్యార్థులను అభినందించారు. అదే విధంగా అతిథులు, ఆర్థిక దాతలను నిర్వహకులు ఘనంగా సత్కరించారు.

## పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప బ్యూరో ఆగస్టు 2 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్‌హూహూకోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ. ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియ జేయవచ్చన్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్కులు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు. అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తిరుమలలో వరుస చోరీలు

### గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకున్న పోలీసులు

తిరుమల: తిరుమలలో వరుస చోరీలు చోటుచేసుకోవడం భక్తుల్లో ఆందోళన కలిగిస్తోంది. గత వారం ఆంజనేయస్వామి విగ్రహం చోరీకి గురికాగా, శుక్రవారం ఒక్కరోజే చైన్‌స్నాచింగ్, భక్తుల బ్యాగ్ చోరీ ఘటనలు వెలుగుచూశాయి. అయితే ప్రతి ఘటనను సవాలుగా తీసుకున్న పోలీసులు వేగంగా స్పందించి గంటల వ్యవధిలోనే నిందితులను గుర్తించి అరెస్టు చేయడం విశేషంగా నిలిచింది.

**కట్టుదిట్టమైన భద్రత.. అయినా :** తిరుమలలో భక్తుల భద్రత కోసం అలిపిరి నుంచే వాహనాలు, భక్తుల తనిఖీలు నిర్వహిస్తున్నారు. తిరుమల వ్యాప్తంగా సుమారు మూడు వేల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేశారు. పోలీసులతో పాటు టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, ఆక్టోపస్ బలగాలు భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. అయినప్పటికీ ఇటీవల వరుస చోరీలు చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

**14 గంటల్లో విగ్రహం చోరీ కేసు ఛేదన:** మొదటి ఘాట్ రోడ్డులోని ఏడో మైలు వద్ద ఆంజనేయస్వామి విగ్రహం చోరీకి గురైన ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఘటనా స్థలికి సమీపంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు ప్రత్యేక బందాలతో దర్యాప్తు చేపట్టి, కేవలం 14 గంటల్లోనే నిందితుడిని ఒంగోలు రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు.

**అతిథి గృహంలో భక్తుల బ్యాగ్ మాయం :** రాంభగీచ అతిథి గృహం--3లో బస చేసిన కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన భక్తులు వేకువజామున మేల్కొని చూడగా కిటికీ వద్ద ఉంచిన బ్యాగ్ కనిపించలేదు. బ్యాగులో సుమారు 50 గ్రాముల బంగారు ఆభరణాలు, ఆపిల్ వాచ్‌లు, ఇయర్‌పాడ్స్, రూ.40 వేల నగదు ఉన్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

**సీసీటీవీతో వేగంగా దర్యాప్తు:** వరుస చోరీ ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ సీసీటీవీ నిఘా వ్యవస్థ పోలీసుల దర్యాప్తుకు కీలకంగా మారింది. ప్రతి కేసులో నిందితుల కదలికలను గుర్తించి స్వల్ప వ్యవధిలోనే అరెస్టు చేయడంతో కేసులు త్వరితగతిన ఛేదించగలిగారు.

**రెండు గంటల్లోనే చైన్‌స్నాచర్ అరెస్ట్ :** పోలీసు క్వార్టర్స్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును ఓ యువకుడు లాక్కెళ్లాడు. వెంటనే సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన పోలీసులు నిందితుడి కదలికలను గుర్తించి అలిపిరి వద్ద రెండు గంటల్లోనే అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కేవీబీపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం కేవీబీపురం మండలంలో చోటుచేసుకుంది. ఏర్పేడు మండలం, పెనుమల్లం గ్రామానికి చెందిన పెమ్మిగారి సెల్వ కుమార్ (50) కేవీబీపురం మండలం, ఆదవరం గ్రామంలోని అక్క పార్వతమ్మ కుటుంబంలో జరిగిన శుభకార్యానికి ద్విచక్ర వాహనంలో హాజరై తిరుగు ప్రయాణమయ్యాడు. ద్విచక్ర వాహనంలో వెళుతుండగా శ్రీకాళహస్తి నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు గుంటమెట్టు వద్ద ఢీకొట్టింది. సెల్వకుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108లో అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కొత్తకండ్రిగ వద్ద మృతిచెందాడు. మృతునికి భార్య కృష్ణవేణి, కుమారుడు భరత్‌కుమార్ ఉన్నారు. సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సెల్వకుమార్ అకాల మరణంతో కుటుంబం వీధిన పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్‌కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఓబయ్య తెలిపారు.

## ఉమ్మడి చిత్తూరు జిల్లా చెస్ పోటీలు ప్రారంభం

నగరి : స్వాతంత్ర్య దినోత్సవంతోపాటు నగరి చెస్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వీకేఆర్ పురం గ్రాండ్ వరల్డ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ ప్రారంభించారు. జూనియర్ విభాగంలో 140 మంది, సీనియర్ విభాగంలో 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ రీజినల్ చైర్‌పర్సన్ ప్రభాకర్ రాజు, పెన్షనర్స్ సంఘం గౌరవ అధ్యక్షుడు ఓ.బాలసుబ్రమణ్యం చెస్ ఆడి పోటీలను ప్రారంభించారు. ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ పూర్వం రాజులు యుద్ధంలో ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థులను మట్టి కరిపించేందుకు అనుసరించిన విధానాలతో పుట్టుకొచ్చిందే చదరంగమన్నారు. అది క్రీడగా మారి విశ్వవ్యాప్తమైందన్నారు. ఈ క్రీడతో జ్ఞాపకశక్తి పెరుగుతుందని, విజ్ఞానాన్ని పెంచుతుందన్నారు. ఓ.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ 29 యేళ్ల క్రితం స్నేహితుల దినోత్సవం రోజు ఈ పోటీలను నగరిలో ప్రారంభించినట్టు తెలిపారు. నేడు అదే స్నేహితుల దినోత్సవం రోజున పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గజేంద్ర మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ ఫైనల్స్ జరుగుతాయని, విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చదరంగ నిపుణులు నవీన్‌కుమార్, ఆదికేశవులు, హర్ష నగరి లయన్స్ క్లబ్ కార్యదర్శి కిషోర్‌కుమార్, కోశాధికారి శక్తివేలు తదితరులు పాల్గొన్నారు.

## 5న పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమో కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు చేస్తున్నట్టు సాంకేతిక విద్యామండలి ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో నిర్వహించిన పాలిసెట్ రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత మిగిలిన సీట్ల భర్తీకి చర్యలు చేపట్టినట్టు పేర్కొంది. ఇందులో భాగంగా ఆయా కళాశాలల్లో ప్రవేశాల కోసం ఎదురు చూసే విద్యార్థులు ఈ నెల 4వ తేదీలోపు స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకుని 5న స్పాట్ అడ్మిషన్లకు ఓరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించింది. మరిన్ని వివరాలకు ఆయా పాలిటెక్నిక్ కళాశాలల కార్యాలయాల్లో సంప్రదించాలని పేర్కొంది.

## కలెక్టరేట్‌లో నేడు పీజీఆర్ఎస్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని విభాగాలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అలాగే మీ మండల, డివిజన్ పరిధిలోని సోమవారం పీజీఆర్ఎస్ ఉంటుందని వెల్లడించారు.

## నేడు 'డయల్ యువర్ సీఎండీ'

తిరుపతి రూరల్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 'డయల్ యువర్ సీఎండి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగ దారులు మొబైల్ నం.8977716661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకురావచ్చని సూచించారు.

## ఇనుము పైపు పడి కార్మికుడి మృతి

శ్రీకాళహస్తి రూరల్: ఇనుము పైపు పడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని రాచగున్నేరి సమీపంలోని ల్యాంకో కర్మాగారంలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ సీఐ ఇబ్రహీం కథనం.. జార్ఖండ్‌కు చెందిన అల్తాబ్ బన్సారి (20) శనివారం క్రేన్‌కు పైపును కడుతుండగా అదుపుతప్పి పైపు అతనిపై పడింది. తీవ్రంగా గాయపడిన అల్తాబ్‌ను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బన్సారి మృతిచెందాడు. కేసు విచారణలో ఉంది.

## కంటైనర్ లారీ ఢీ - డ్రైవర్ మృతి

పెళ్లకూరు: నాయుడుపేట--పూతలపట్టు జాతీయ రహదారి మార్గం, చిల్లకూరు గ్రామం వద్ద ఆదివారం ముందు వెళుతున్న గుర్తుతెలియని వాహనాన్ని కంటైనర్ లారీ ఢీకొనడంతో డ్రైవర్ అరూల్(30) తీవ్ర గాయాలై మృతి చెందాడు. పోలీసుల సమాచారం.. కడపలో స్పేర్ పార్ట్స్ అన్‌లోడ్ చేసిన కంటైనర్ డ్రైవర్ అరూల్ తిరిగి చెన్నైకి వెళుతున్నాడు. మార్గ మధ్యంలో చిల్లకూరు గ్రామం వద్ద ఉన్న ఫ్లైఓవర్‌పై ముందు వెళుతున్న వాహాన్ని అదిగమించే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు దాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన కంటైనర్ లారీ డ్రైవర్ అరూల్‌ను చికిత్సలు నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

## రాజంపేటలో శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

రాజంపేట పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీరామ్ ఫైనాన్స్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదంలో కార్యాలయంలోని ఫర్నిచర్, కంప్యూటర్లు, ముఖ్యమైన పత్రాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అగ్నికి ఆహుతైనట్లు ప్రాథమిక సమాచారం. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, ఆస్తి నష్టం వివరాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

## బొలెరో ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

మదనపల్లె టౌన్ : ఆటో కోసం రోడ్డు పక్కన నిలిచి ఉన్న మహిళను బొలెరో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఆదివారం రాత్రి మదనపల్లి మండలంలో జరిగిన ఘటనపై బాధితురాలి కుటుంబీకులు తెలిపిన వివరాలు.. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లికి చెందిన పార్వతమ్మ సొంత పనిపై మదనపల్లెకు వచ్చింది. పని ముగించుకుని వలసపల్లి నవోదయ ఆర్చి వద్ద దిగి ఆటో కోసం వేచి ఉండగా బొలెరో ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో కాళ్లు రెండు విరిగి తీవ్రంగా గాయపడ్డ బాధితురాలని 108 సిబ్బంది చికిత్స కోసం స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్ల సలహా పై వెంటనే తిరుపతి రుయాకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉందని తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపారు.

## ఆటో ఢీకొని తండ్రి, కుమార్తెకు గాయాలు

మదనపల్లె టౌన్ : ఆటో ఢీకొని తండ్రి, కుమార్తె తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లిలో చోటు చేసుకుంది. తంబళ్లపల్లె మండలం కోసివారిపల్లి పంచాయతీ దిగువ ముట్రవారిపల్లికి చెందిన రామలింగారెడ్డి తన కుమార్తె అములును బెంగుళూరులో వదిలేందుకు మదనపల్లి ఆర్టీసీ బస్టాండ్‌కు బైకులో బయలుదేరాడు. మదనపల్లి పట్టణం అమ్మచెరువు మిట్ట వద్దకు రాగానే ఆటో వెనక నుంచి వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. రామలింగారెడ్డి, అతని కుమార్తె తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని జిల్లా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం రామలింగారెడ్డిని తిరుపతికి రెఫర్ చేశారు.

## వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్ : వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన అనిత (27)ను కుటుంబ విషయమై అత్త మందలించడంతో మనస్తాపానికి గురైన ఆమె నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. ఫ రామారావుకాలనీకి చెందిన విష్ణుప్రియ (21) కుటుంబ సమస్యలతో ఆదివారం ఇంట్లో ఉన్న నెయిల్ పాలిష్ తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రెండోపట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

## చింతచెట్ల నరికివేతపై కేసు నమోదు చేయాలి

పీలేరు రూరల్ : మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ చిన్నగాండ్లపల్లెలో చింతచెట్ల నరికివేతపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బాధితుడు జి.వి. రమణ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చిన్నగాండ్లపల్లెలో తమకు చెందిన చింత చెట్లను అదే గ్రామానికి చెందిన వారు ఉద్దేశపూర్వకంగా నరికివేయడం జరిగిందని తెలిపారు. చింతచెట్లను నరకడంతో పాటు కుల వివక్షత చూపినట్లు గత నెల 31న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఫిర్యాదు చేసి రెండు రోజులైనా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి తాము ఇచ్చి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు.

## బోయకొండకు పోటెత్తిన భక్తజనం

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రం బోయకొండ ఆదివారం భక్తులతో కిటికిటలాడింది. వేకువజామునే ఆలయ అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, పంచామృతాలతో అభిషేకించారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రద్దీ కొనసాగింది. ఆదివారం సుమారు 50 వేల మందికి పైగా అమ్మవారిని దర్శించుకొన్నట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. ఆషాడమాసంలో కర్ణాటక భక్తులు అమ్మవారిని అత్యంత శుభకరమైన నెలగా భావించి వేల సంఖ్యలో తరలిరావడం గమనార్హం. ఈ స?దర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు సుందరంగా అలంకరణ చేసి దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చింది.